సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



హస్తకళలను ప్రోత్సహించాలి
యాదగిరి క్షేత్రానికి వచ్చే భక్తులు హస్తకళా విక్రయశాలలో వస్తువులు కొనుగోలు చేయాలని శైలజా రామయ్యర్ కోరారు. - 8లో



ప్రారంభానికి సిద్ధం..
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నిర్మిస్తున్న అన్నప్రసాదం భవనం ప్రారంభానికి సిద్ధమవుతోంది. - 8లో



ఎయిమ్స్‌లో మరిన్ని వైద్యసేవలు
బీబీనగర్ ఎయిమ్స్‌లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

సివిల్ సప్లై కార్యాలయంలో కాల్ సెంటర్

సాక్షి,యాదాద్రి : ధాన్యం సేకరణలో సమస్యల సత్వర పరిష్కారం కోసం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి **92814 23621** నంబర్ అందుబాటులో ఉంచారు. కొనుగోలు కేంద్రాల ఏజెన్సీలు, పౌర సరఫరాల శాఖ, రవాణా కాంట్రాక్టర్ల నుంచి ఒక ప్రతినిధిని నియమించారు. కాల్‌సెంటర్‌ను బుధవారం సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికృష్ణ ప్రారంభించి మాట్లాడారు. కొనుగోళ్లు, రవాణా, చెల్లింపులు తదితర విషయాలపై ఎలాంటి సందేహాలున్నా కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టామని, ప్రతిపాదించిన 372 కేంద్రాల్లో 25 చోట్ల ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు వనజాత, రోజారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి నీలిమ పాల్గొన్నారు.

గుట్ట పాలిటెక్నిక్ కాలేజీలో నేడు ఉద్యోగమేళా

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం కోకా కోలా కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చన్నారు. వయో పరిమితి 18–24 సంవత్సరాలు, కనీస మార్కులు 60 శాతం ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి రూ.3.50 లక్షల వేతనం, ఉచిత రవాణా, భోజన సౌకర్యం కంపెనీ కల్పిస్తుందని వివరించారు. ఒరిజినల్ పదో తరగతి, డిప్లొమో సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 8919925381కు సంప్రదించాలని సూచించారు.


ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్న సృజన



ప్రధాని చేతుల మీదుగా పశంసా పత్రం అందుకున్న సృజన (కుడి వైపు చివరి మహిళ)

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు చెందిన కలువల సృజన ఈ నెల 7న ఢిల్లీలో నిర్వహించిన ముద్ర యోజన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. సృజన ముద్ర లోన్ పొంది శారీ సెంటర్ పెట్టి నలుగురికి ఉపాధి కల్పిస్తోంది. దీంతో ఆమెను ముద్ర యోజన దశాబ్ది ఉత్సవాలకు తెలంగాణ తరఫున ఆహ్వానించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వస్త్ర వ్యాపారంలో భర్త సురేష్‌రెడ్డి ప్రోత్సాహంతో రాణించడం వల్ల తనకు ఈ పురస్కారం దక్కిందని చెప్పారు. సృజనను పలువురు అభినందించారు.

యాదగిరి క్షేత్రంలో జోడు సేవోత్సవం



స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. అదే విధంగా ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్ల జోడు సేవలను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి ఆలయద్వార బంధనం చేశారు.



● గ్యాస్ మంట
కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై పెంచిన ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాళ్లు

కొందరికే పరిహారం!

కాళేశ్వరం -15 కెనాల్‌కు 800 ఎకరాల భూ సేకరణ

ఇంకా 115 మంది రైతులకు పరిహారం పెండింగ్.. ఏడేళ్లుగా నిరీక్షణ

- సర్వే నంబర్ మొత్తం హోల్డ్‌లో..
- ఆ రైతులకు అందని పథకాలు, అవసరాలకు భూములు అమ్ముకోలేని దయనీయ స్థితి
- కలెక్టరేట్‌లో, డివిజన్, మండల స్థాయిలో పలుసార్లు వినతులు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు
- సొమ్ము విడుదలలో జాప్యం



రాజాపేట మండలం సింగారంలో కొంతదూరం తవ్వి వదిలేసిన కాళేశ్వరం కాలువ



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు ఆకుల పద్మ. రాజాపేట మండలం బేగంపేటలో ఆరు ఎకరాల భూమి ఉంది. ఇందులో మూడు ఎకరాలు కాళేశ్వరం కాలువ గ్రావిటీ కోసం ప్రభుత్వం తీసుకుంది. ఈమె భూమిపైనే ఆధారపడి జీవిస్తుంది. ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె వివాహం చేయగా, ఇంకా ఇద్దరు ఆడపిల్లలు వివాహానికి ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న భూమికి పరిహారం చెల్లించకపోవడంతో ఏడేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. పెద్ద కుమార్తె పెళ్లికోసం చేసిన అప్పు రూ.2లక్షలు ఇంకా తీర్చలేకపోతుంది. రైతుభరోసా రావడం లేదని, అవసరానికి భూమి కూడా అమ్మే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

రాజాపేట : కాళేశ్వరం –15 కెనాల్ కోసం భూములిచ్చిన రైతుల్లో కొందరికీ పరిహారం అందగా.. మరి కొందరు ఏడేళ్లుగా నిరీక్షిస్తున్నారు. అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కలెక్టరేట్‌ల డివిజన్, మండల స్థాయిలో అనేసార్లు వినతులు అందజేసినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా.. సొమ్ము విడుదల కాని దయనీస్థితి నెలకొంది.

ఎకరం రూ.7.80లక్షల చొప్పున

కాళేశ్వరం ప్రాజెక్టు- 15 కెనాల్ ద్వారా గ్రావిటీ ఏర్పాటు చేసి ఆలేరు ప్రాంతానికి సాగు నీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం 2018లో ప్రణాళికలు రూపొందించింది. ఆలేరు, యాదగిరిగుట్ట, రాజా పేట, తుర్కపల్లి మండలాలకు సాగునీరు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆయా మండలాల్లోని 35 గ్రామాల పరిధిలో సుమారు 800 ఎకరాల భూములు సేకరించింది. నష్ట పరిహారంగా ఎకరాకు రూ.7లక్షల 80 వేలు చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. రూ.52 కోట్లు పరిహారం చెల్లించాల్సింది. ఆలేరు, గుట్ట, తుర్కపల్లి మండలాల్లో పూర్తిగా చెల్లించగా.. రాజాపేట మండలంలో పెండింగ్ ఉంది.

సర్వే నంబర్ ఫ్రీజ్‌తో అవస్థలు

ఒక రైతుకు సర్వే నంబర్‌లో 10 ఎకరాలు ఉంటే అతని నుంచి ఎకరం భూమి ప్రభుత్వం సేకరించింది. మిగతా భూమి మొత్తాన్ని అంటే సంబంధిత సర్వే నంబర్‌ను పూర్తిగా హోల్డ్‌లో పెట్టింది. దీంతో రైతు తన అవసరాలకు భూమి అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఆపద సమయంలో భూమి విక్రయించాలన్నా, తమ పిల్లల పెండ్లిల్లు చేద్దామన్నా, అప్పులు తీర్చాలన్నా ఏం చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం చెల్లించి హోల్డ్‌లో నుంచి భూములను తొలగించాలని, రైతుభరోసా పడేవిధంగా చూడాలని నేటికీ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ఎన్నోసార్లు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేశారు.

115 మంది రైతులకు పెండింగ్

రాజాపేట మండలంలో సింగారం, మల్లగూడెం, కొండ్రెడ్డిచెర్వు, నర్సాపురం, బేగంపేట, చల్లూరులో భూములు సేకరించింది. సింగారం, మల్లగూడెం, కొండ్రెడ్డిచెర్వు, నర్సాపురం రైతులకు పరిహారం చెల్లించగా.. బేగంపేట, చల్లూరు రైతులకు ఇవ్వలేదు. ఈ రెండు చోట్ల 72 ఎకరాలకు 115 మంది రైతులకు రూ.5 కోట్లుకు పైగా పరిహారం అందాల్సి ఉంది.



ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు (ఫైల్)

కాలువ వచ్చే వరకు సేద్యం చేసుకుంటాం



మాకు జీవనాధారంగా ఉన్న రెండున్నర ఎకరాల భూమిని ప్రభుత్వం కాళేశ్వరం కాలువ కోసం తీసుకుంది. అందులో వేలాది రూపాయలు వెచ్చించి వేసిన బోరు కూడా పోయింది. ఉన్న భూమి తీసుకోవడంతో ఎలాంటి ఆధారం లేదు. అధికారులు స్పందించి మా భూమి మాకు ఇవ్వాలి. కాలువ వచ్చినప్పుడు తిరిగి ఇస్తాం. అప్పటి వరకు సేద్యం చేసుకుంటాం.

–నీల ఉప్పలయ్య, బేగంపేట

జీవనాధారం పోయింది



మాకు ఉన్న ఎకరం భూమి కాలువ కోసం అని ప్రభుత్వం తీసుకుంది. ఏడాదికి ఎంతో కొంత తిండిగింజల మందం సేద్యం చేసుకుని జీవించేవాళ్లం. ఉన్న భూమి పోవడంతో ఎలాంటి ఆదెరువు లేకుండా పోయింది. ఉన్న ఇల్లు కూడా కూలిపోతుంది. అధికారులు స్పందించి మా భూమి మాకు ఇవ్వాలి. లేదా పరిహారం చెల్లించాలి.

–ఒరుగంటి యాదగిరి, బేగంపేట

రెండు రోజుల్లో సమావేశం ఉంది

కాళేశ్వరం 15 కెనాల్ కోసం సేకరించి అవార్డు చేసిన భూములు మొత్తం నీటి పారుదల శాఖ పరిధిలోకి వెళ్లాయి. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంది. నిధులు రాగా వెంటనే రైతులకు పరిహారం చెల్లిస్తాం. ఈ విషయంపై రెండు రోజుల్లో ప్రత్యేక సమావేశం ఉంది. ఏదో రకంగా డబ్బు కేటాయించి రైతులకు అందజేసే విధంగా కృషి చేస్తాం.

–జయశ్రీ, కాళేశ్వరం 14,15 కెనాల్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఉపాధిహామీ కూలీల చెంతకు బడిబాట



ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులపై ఉపాధిహామీ కూలీలకు వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకన్న

ఆత్మకూరు(ఎం) : బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం పోతిరెడ్డిపల్లికి వెళ్లారు. చాలామంది ఉపాధిహామీ పనులకు వెళ్లడంతో.. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు.. ఉపాధిహామీ పనులు నిర్వహించే ప్రదేశానికి వెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయని, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని.. ఈ అవకాశాలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఒత్తిడి లేని విద్య ఉంటుందని, మీ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు రవి, వరప్రసాద్, శ్రీనువాసాచారి, అనురాధ, వెంకటేశం పాల్గొన్నారు.

దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపండి

- కలెక్టర్ హనుమంతరావు



రాజాపేట తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

రాజాపేట, యాదగిరిగుట్ట రూరల్ : వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని, కార్యాలయాలకు తిప్పించుకోవద్దని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం రాజాపేట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ధరణి సమస్యలకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. ధరణితో పాటు రేషన్ కార్డులు ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తులు, విజ్ఞప్తులను జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై యువతకు అవగాహన కల్పించి లబ్ధి పొందేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అనిత, ఎంపీడీఓ నాగవేణి ఉన్నారు. అదే విధంగా యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణిలో తప్పుడు రిపోర్టులకు తావు లేకుండా చూసుకోవాలని సూచించారు.

రైతుబజార్‌లో కూరగాయలు ఫుల్



అన్ని రకాల కూరగాయలతో కళకళలాడుతున్న భువనగిరి రైతుబజార్

సాక్షి ఎఫెక్ట్

భువనగిరి టౌన్: పట్టణంలోని రైతుబజార్ అన్ని రకాల కూరగాయలతో కళకళలాడుతోంది. స్థానిక రైతులు, వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా హైదరాబాద్ నుంచి ఆలుగడ్డ, క్యారెట్, బీట్‌రూట్, చామగడ్డ, క్యాప్సికం, చిక్కుడు కాయ దిగుమతులు 15 రోజులుగా నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై 'రైతుబజార్‌లో కూరగాయల కొరత' శీర్షికతో గత నెల 31న సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రైతుబజార్‌ను సందర్శించి సమస్య తెలుసుకున్నారు. బుధవారం సుమారు 25 రకాల కూరగాయలను అందుబాటులో ఉంచారు. ఆలుగడ్డ, క్యారెట్, బీట్‌రూట్, చామగడ్డ, క్యాప్సికం చిక్కుడు కాయలను హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి దిగుమతి చేయించారు. ఇకనుంచి సమస్య ఉండదని తెలిపారు.

నల్లగొండ రీజియన్‌కు 152 ఎలక్ట్రిక్ బస్సులు

- సూర్యాపేట డిపోకు 75, నల్లగొండకు 77 కేటాయింపు
- త్వరలో రోడ్డెక్కనున్న బస్సులు



సూర్యాపేట ఆర్టీసీ డిపో ఆవరణలో ఎలక్ట్రిక్ బస్సులు

భానుపురి (సూర్యాపేట) : నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో బస్సుల కొరత తీరనుంది. డొక్కుబస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. 152 బస్సులు కేటాయించగా.. వీటిలో 41 బస్సులు సూర్యాపేట డిపోకు చేరుకున్నాయి. మిగితావి త్వరలోనే ఆయా డిపోలకు రానున్నాయి. ఈ బస్సులన్నీ చార్జింగ్‌తోనే నడవనున్నాయి. సూర్యాపేట, నల్లగొండలో ఈ చార్జింగ్ పాయింట్ల పనులు వేగంగా సాగుతున్నాయి.

రెండుచోట్ల చార్జింగ్ పాయింట్లు

ఆర్టీసీ సంస్థ కొద్దిరోజులుగా ఎలక్ట్రిక్ బస్సులను వినియోగిస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రధాన నగరాలకు ఇప్పటికే నడుస్తున్నాయి. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిలో ప్రధాన బస్టాండ్ అయిన సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో ఈ ఎలక్ట్రిక్ బస్సుల కోసం చార్జింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు.ఇక్కడ రోజుకు ఐదారు బస్సులకు మాత్రమే చార్జింగ్ పెడుతున్నారు. సూర్యాపేట డిపోకు దాదాపు 77 బస్సులు రావడంతో కొత్తబస్టాండ్ డిపో ఆవరణలోనూ చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండలో కూడా చార్జింగ్ పాయింట్ పనులు కొనసాగుతున్నాయి. ఆయా బస్టాండ్ల నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ మొత్తంలో బస్సులను నడపనున్నారు. నల్లగొండ - సూర్యాపేట, సూర్యాపేట - వరంగల్, సూర్యాపేట - ఖమ్మం, నల్లగొండ- మిర్యాలగూడ రూట్లలో ఇలా డిపోల పరిధిలో బస్సులను నడపనున్నారు.

ప్రయాణికులకు మెరుగైన రవాణా

మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడానికి ఆర్టీసీ అత్యాధునిక బస్సులను ప్రవేశపెడుతోంది. త్వరలోనే రీజియన్‌కు కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డుపైకి రానున్నాయి. బస్సుల కొరత తీరడంతో పాటు ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం అందనుంది.

–జానిరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

రూ.4లక్షల యూనిట్లకు డిమాండ్!

రాజీవ్ యువ వికాసానికి భారీ స్పందన

- 25,262 మంది దరఖాస్తు
- ఎక్కువ విలువ చేసే యూనిట్లపైనే ఆసక్తి
- రూ.లక్ష లోపు యూనిట్‌లకు అంతంతమాత్రంగానే స్పందన



సాక్షి, యాదాద్రి : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం నాటికి 25,262 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు గడువు మరో ఐదు రోజులు ఉన్నందున 30 వేలు మించే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా దరఖాస్తుల్లో అధికంగా రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు విలువ చేసే యూనిట్‌లకు సంబంధించినవే ఉండడం గమనార్హం. తక్కువ విలువ కలిగిన యూనిట్లకు వంద శాతం సబ్సిడీ ఉన్నప్పటికీ యువత పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు
ఎస్సీ 6,571
ఎస్టీ 1712
బీసీ 15,466
ఈబీసీ 451
మైనార్టీ 1,022
క్రిస్టియన్ మైనార్టీ 40
మొత్తం 25,262

ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చిన దరఖాస్తులు ఇలా..

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ యూనిట్‌ల కోసం మొత్తం 6,571 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రూ.లక్ష లోపు విలువ చేసే యూనిట్‌లు 1,007 ఉన్నాయి. వీటికి వంద శాతం సబ్సిడీ ఉన్నప్పటికీ కేవలం 34 దరఖాస్తులే వచ్చాయి. ఆలేరు, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లో ఒక్క దరఖాస్తు రాలేదు. అలాగే ఆలేరు, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం, మోత్కూరు, సంస్థాన్‌నారాయణపురం, తుర్కపల్లి మండలాల్లోనూ ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. ఇక రూ.2లక్షల వరకు విలువ చేసే యూనిట్‌లు 781 ఉండగా 411 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.3 లక్షలకు సంబంధించి జిల్లాకు 496 యూనిట్‌లు కేటాయించగా 2,142, రూ.3నుంచి రూ.4 లక్షల వరకు 411 యూనిట్‌లు ఉండగా 2,967 దరఖాస్తులు వచ్చాయి. ఇక బ్యాంకు లింకేజీతో సంబంధం లేని మైనర్ ఇరిగేషన్‌లో బోర్లు, సోలార్, విద్యుత్ మోటార్ కనెక్షన్‌కు సంబంధించి 103 యూనిట్‌లకు గాను కేవలం ఐదు దరఖాస్తులే వచ్చాయి. ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్లలోనూ ఎక్కువ మొత్తం విలువ చేసే యూనిట్‌లకే అధిక దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

దళితబంధు లబ్ధిదారులకు నో చాన్స్

దళితబంధు లబ్ధిదారులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుఅవకాశం లేదు. ప్రభుత్వం ద్వారా ఒకసారి లబ్ధిపొందిన తర్వాత మళ్లీ ఐదేళ్ల వరకు అనర్హులు. చాలా మంది దళితబంధు లబ్ధిదారులు మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోగా రాజీవ్ యువ వికాసం పథకం సైట్‌లో అప్‌లోడ్ కావడం లేదు.

హార్డు కాపీలు అందజేయాలి

రూ.లక్షలోపు విలువ చేసే యూనిట్‌లకు వంద శాతం సబ్సిడీ ఇస్తున్నప్పటికీ దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయి. పెద్ద మొత్తంలో విలువ చేసే యూనిట్‌లకే డిమాండ్ ఎక్కువగా ఉంది. దరఖాస్తుదారులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసిన హార్డ్ కాపీలను అందజేయడం లేదు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు హార్డు కాపీలు తప్పనిసరిగా అప్పగించాలి. దరఖాస్తు గడువు ఈనెల 14వరకు ఉంది. యువత సద్వినియోగం చేసుకోవాలి.

–జినుకల శ్యాంసుందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

పూలే జయంతి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవ ఏర్పాట్లను బుధవారం బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్య పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఉత్సవాలకు వచ్చే ఆహ్వానితులకు ఏ చిన్న ఇబ్బంది రావద్దని.. వేసవి దృష్ట్యా టెంట్, మంచినీటి సరఫరా, కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి వెంకటేష్, ఉత్సవాల కమిటీ సభ్యులు కొడారి వెంకటేష్, కాత్త బాలరాజు, కొత్త నర్సింహ స్వామి, సిరికొండ శివకుమార్, చిన్నగారి కృష్ణ, జూకంటి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యంతో కడుపు నిండా తింటున్నాం

- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- గిరిజనుడి ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే కుంభం

బీబీనగర్: గతంలో దొడ్డు బియ్యం తినలేక అమ్ముకునేవాళ్లం.. ఇప్పుడు సన్నబియ్యంతో కడుపునిండా తింటున్నాం అని బీబీనగర్ మండలంలోని రావిపహాడ్‌కు చెందిన సన్నబియ్యం లబ్ధిదారుడు బానోతు కాంతి శంకర్‌నాయక్, అతని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శంకర్‌నాయక్ ఇంట్లో భోజనం చేశారు. సన్నబియ్యం అన్నం, జొన్నరొట్టె, చికెన్‌తో వడ్డించారు. సన్నబియ్యం అన్నం ఎలా ఉంటుందని శంకర్‌నాయక్ కుటుంబీకులను ఎమ్మెల్యే ప్రశ్నించగా.. బాగుంటుందని సమాధానం ఇచ్చారు. ధనికులు, పేదలు ఒకే రకమైన అన్నం తినాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పథకం ప్రారంభించారని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డీఓ ఉన్నారు.



శంకర్‌నాయక్ ఇంట్లో సన్న బియ్యంతో వండిన అన్నం తింటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

సూర్యాపేటటౌన్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి రూ.1500 జరిమానాతో పాటు ఒకరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ బుధవారం సూర్యాపేట జిల్లా సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బీవీ రమణ తీర్పు వెలువరించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఏడుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి రూ.1500 జరిమానాతో పాటు ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త


నరసకుమారి (ఫైల్)

అడవిదేవులపల్లి: భార్యపై అనుమానంతో భర్త ఆమెను హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామంలో జరిగింది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పూజల బాలసైదులుకు అదే గ్రామానికి చెందిన గువ్వ ల శివయ్య కుమార్తె నరసకుమారి(30)తో 14ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్ల లున్నారు. నరసకుమారి మరో వ్యక్తితో వివా హేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో బాలసైదులు తరచూ ఆమెతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలసైదులు కత్తితో నరసకుమారిని పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం తన బైక్‌పై పరారయ్యాడు. బుధవారం తెల్ల వారుజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మిర్యాలగూడ రూరల్ సీఐ పి. నాగదుర్గ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి శివ య్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శాలిగౌరారం: బంధువుల ఇంటి వద్ద శుభ కార్యానికి హాజరై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం ఎన్‌జి కొత్తపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన బండి యాదగిరి(55) మంగళవారం కట్టంగూర్ మండలం నారెగూడెంలో తన బంధువుల ఇంట్లో జరిగిన ఎల్లమ్మ పండుగకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి రాత్రి తన బంధువులైన బూడిద భిక్షం, బూడిద యాదయ్యను యాదగిరి బైక్‌పై ఎక్కించుకుని వారి ఊరైన శాలిగౌరారం మండలం ఎన్‌జి కొత్తపల్లిలో దింపేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో శాలిగౌరారం మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి రాగానే.. బూడిద భిక్షం, బూడిద యాదయ్యను తీసుకెళ్లేందుకు మరో బైక్ రాగా వారు దానిపై ఎక్కి వెళ్లారు. యాదగిరి ఎన్‌జి కొత్తపల్లి మీదుగా లక్ష్మీదేవికాల్వ గ్రామానికి వెళ్తుండగా.. ఎన్‌జి కొత్తపల్లి గ్రామ శివారులో గజ్జి అంజయ్య తన పొలంలో వరి పంట కోస్తుండగా ధాన్యం తీసుకెళ్లడానికి రోడ్డు వెంట ట్రాక్టర్‌ను నిలిపి పొలంలోకి వెళ్లాడు. అదే రోడ్డు వెంట వేగంగా వచ్చిన బండి యాదగిరి నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యాదగిరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి, బుధవారం మృతుడి పెద్ద అల్లుడు చిలుకూరి యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హస్తకళలను ప్రోత్సహించాలి

- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే భక్తులు హస్తకళా విక్రయశాలలో వస్తువులను కొనుగోలు చేసి హస్తకళలను ప్రోత్సహించాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. యాదగిరిగుట్ట ఆలయ సన్నిధిలోని బస్టాండ్ చెంత తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోల్కొండ హస్తకళా విక్రయశాలను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. వివిధ హస్తకళలకు సంబంధించిన వస్తువులు గోల్కొండ హస్తకళల విక్రయశాలలో లభిస్తాయని పేర్కొన్నారు. హస్తకళలను ప్రోత్సహించడానికి ఈ విక్రయశాలలను ఏర్పాటు చేసేందుకు ఆలయ ఈఓ భాస్కర్ రావు కృషిచేశారని అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి హస్తకళలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళలను తీసుకువచ్చి ఇందులో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హస్తకళలను, నైపుణ్యాన్ని పెంపొందించాలని చూస్తోందన్నారు. పెంబర్తి నుంచి హస్త కళాకారులు, బంజారా కళాకారులు వచ్చి డెమోలను ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సుమారు 45రోజుల్లోనే యాదగిరిగుట్ట ఆలయ సన్నిధిలో హస్తకళల విక్రయశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విక్రయశాలతో పలువురికి జీవనోపాధి లభిస్తుందన్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన హస్తకళాకారులు తాము రూపొందించిన మోడల్స్‌ను ఈ విక్రయశాలకు తీసుకొచ్చారన్నారు. రాబోయే రోజుల్లో హస్తకళల విక్రయశాలలను మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ ఓఎస్‌డీ బాషా, మసూద్ అలీ, వేణుగోపాల్, గాయత్రి, సుల్తానా, శ్రీపాణి, మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


హస్తకళా విక్రయశాలను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యర్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ సత్యనారాయణ

తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

బీబీనగర్: తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించకుండా వారిని చూసుకునే బాధ్యత పిల్లలదేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బీబీనగర్ మండల కేంద్రంలో దాతల సహకారంతో నిర్మించిన వయో వృద్ధుల ఆశ్రయ భవనాన్ని బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ.. వృద్ధుల కోసం ఉన్నటువంటి చట్టాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచిందని, అలాగే ప్రతిఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు బదులుగా ఆరోగ్య బీమాను కల్పించేలా ఆలోచిస్తుందని అన్నారు. దీంతో తల్లిదండ్రులు భారం అనుకునే వారికి భయం ఉండదని అన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబ సభ్యులను ఎలా ఆదుకోవాలో అన్న అంశంపై శాసనసభ, శాసనమండలిలో చాలా సీరియస్‌గా చర్చ జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 40లక్షల మంది వయో వృద్ధులకు ప్రభుత్వం పెన్షన్లు ఇస్తుందని, అన్నివర్గాల వారికి మేలు జరిగే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వయో వృద్ధులు మానసికంగా బలంగా ఉండాలని అన్నారు. వృద్ధుల కోసం పార్కు ఏర్పాటుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వయో వృద్ధుల భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కాసుల సత్యనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, కోశాధికారి సోమయ్య, ఉపాధ్యక్షులు ఆగమయ్య గౌడ్, ఎర్ర మనోహర్ తదితరులు పాల్గొన్నారు,


వయో వృద్ధుల ఆశ్రయ భవనాన్ని ప్రారంభిస్తున్న గుత్తా, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో పలు వాహనాలకు బుధవారం ఆయన పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. వరంగల్ సభ పండుగను తలపించేలా ఉండబోతుందన్నారు. కేసీఆర్ ఇచ్చే సందేశాన్ని వినేందుకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చేందుకు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అమలు చేస్తున్న పథకాలు సగానికే పరిమతయ్యారని ఆరోపించారు. రుణమాఫీ సగంలోనే ఆపేశారని, తులం బంగారం ఊసే లేదన్నారు. వరంగల్ సభకు నకిరేకల్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు తలారి బలరాం, మాద ధనలక్ష్మి, మండల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, నాయకులు పెండెం సదానందం, పల్లె విజయ్, దైద పరమేశం, వంటల చేతన్, రాచకొండ వెంకన్నగౌడ్, యానాల లింగారెడ్డి, సామ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బస్సుకు పోస్టర్ అంటిస్తున్న చిరుమర్తి లింగయ్య

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని విజయ పైపుల కంపెనీ సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం గ్రామ పరిధిలోని సంగం హోటల్ ప్రాంతంలో గుర్తుతెలియని యాచకుడు గత ఐదు రోజులుగా సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. బుధవారం అదే వ్యక్తి విజయ కంపెనీ సమీపంలో మృతిచెందడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, లోపల ఎరుపు రంగు టీషర్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్నప్రసాద భవనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద భవనం త్వరలోనే ప్రారంభంకానుంది. ఇప్పటికే అన్నప్రసాద భవనంలో పనులన్నీ పూర్తయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. వేగేశ్న సంస్థకు సంబంధించిన నిర్వాహకులు అన్నప్రసాద భవన నిర్మాణానికి సుమారు రూ.11కోట్ల వరకు ఖర్చు చేయగా, మిగిలిన పనుల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో ఖర్చు చేశారు. భక్తులు కూర్చొని తినే విధంగా బెంచీల ఏర్పాటు, ఇతర సామగ్రి బిగింపు పనులను సైతం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు భవనం చుట్టుపక్కల గ్రీనరీ ఏర్పాటుతో పాటు మొక్కలను నాటుతున్నారు. అన్నప్రసాదం స్వీకరించేందుకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.


యాదగిరిగుట్ట దిగువన నిర్మించిన అన్న ప్రసాద భవనం

ఎయిమ్స్‌లో అందుబాటులోకి మరిన్ని వైద్య సేవలు

- బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్‌లో రాబోయే రోజుల్లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. బుధవారం ఎయిమ్స్ వైద్య కళాశాల రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ జార్జ్ ఏ డిసౌజా వర్చువల్‌గా మాట్లాడారు. అదేవిధంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వికాస్ భాటియా మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ ప్రకారం రాబోయే రోజుల్లో ఎయిమ్స్ పురోగతి ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంఘమిత్ర పతి, డీన్ రాహుల్ నారంగ్, డాక్టర్లు సంగీత సంపత్, అభిషేక్ ఆరోరా, నితిన్‌జాన్, వర్గీస్ పాల్గొన్నారు.


బుక్‌లెట్ విడుదల చేస్తున్న వికాస్ భాటియా తదితరులు

ఏటీఎంను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి నగదు చోరీ

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను దొంగలు గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. అంకిరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద దివీస్ పరిశ్రమ ఉండడంతో నల్లగొండ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏటీఎం ఏర్పాటు చేశారు. ఆ ఏటీఎంలో డబ్బులు నిల్వ చేయడం, దాని ఆపరేటింగ్ అంతా నల్లగొండలోని ఎస్‌బీఐ బ్రాంచ్ చూసుకుంటుంది. ఏటీఎం మానిటరింగ్‌ను ముంబైలోని బ్యాంకు ప్రధాన కార్యాలయం వారు చూస్తున్నారు. ఈ ఏటీఎంలో మంగళవారం సాయంత్రం సిబ్బంది నగదును నింపి వెళ్లారు. అయితే, బుధవారం తెల్లవారుజాము 5గంటల నుంచి సాయంత్రం వరకు ఈ ఏటీఎం నుంచి ఎలాంటి లావాదేవీలు జరగకపోవడాన్ని ముంబైలోని ప్రధాన కార్యాలయం వారు గుర్తించి.. చౌటుప్పల్ పోలీసులకు రాత్రి 7గంటలకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా.. ఏటీఎం షెట్టర్ మూసివేసి ఉంది. షెట్టర్‌ను పైఎత్తి చూడగా గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన ఆనవాళ్లు కనిపించాయి. అందులో నగదు చోరీకి గురైందని నిర్ధారించుకొని నల్లగొండ ఎస్‌బీఐ బ్రాంచ్‌కి, పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

రూ.20లక్షలకు పైగా చోరీ?

ఆ ఏటీఎం నుంచి వినియోగదారుల చివరి లావాదేవీ బుధవారం తెల్లవారు జామున 4:25 గంటలకు జరిగింది. తర్వాత దుండగులు ఏటీఎంను చి నగదు ఎత్తుకెళ్లడంతో.. సుమారు రూ.20 లక్షలకు పైగా నగదు చోరీకి గురైనట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. బ్యాంకు అధికారులు ఎంత నగదు పోయిందన్న విషయాన్ని నిర్ధారించలేదు.

ఏటీఎంను పరిశీలించిన భువనగిరి డీసీపీ

చోరీ జరిగిన విషయం తెలుసుకున్న భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, రాచకొండ క్రైం డీసీపీ అరవింద్ బాబు, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడి, సీఐ మన్మథకుమార్ ఘటన స్థలానికి చేరుకొని చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

ఇదే ఏటీఎంలో మూడేళ్ల క్రితం చోరీకి యత్నం

గతంలో 2022లో ఇదే ఏటీఎంలో చోరీ చేయడానికి గుర్తుతెలియని దుండగులు ప్రయత్నించారు. అప్పుడు కూడా ఏటీఎంను పగులగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పట్లో ఈ ఘటనపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ ఇప్పటివరకు దుండగులను గుర్తించలేదు.


ఏటీఎంను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసిన దృశ్యం

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

భువనగిరిటౌన్ : దళిత బహుజన పార్టీ భువనగిరి నియోజకవర్గ నాయకుడు, బీబీనగర్ మండలం వెంకిర్యాల వాసి బీరం సతీష్ ఇంటిపై మూకుమ్మడి దాడి చేసి గాయపర్చిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరిలోని సతీష్ ఇంటికెళ్లి ఆయనను పరామర్శించారు. బీబీనగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, భువనగిరి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయాలకు బాధితుడితో కలిసి వెళ్లి నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వాకబు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఈ కేసులో బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే త్వరలో డీజీపీ, ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను కూడా ఆశ్రయిస్తామన్నారు. ఆయన వెంట బాధితుడు బీరం సతీష్ అతని కుటుంబ సభ్యులు, వెంకిర్యాల గ్రామ దళిత నాయకులు ఉన్నారు

భర్తపై హత్యాయత్నం.. భార్యకు జైలు శిక్ష

చివ్వెంల(సూర్యాపేట): భర్తపై హత్యాయత్నం చేసిన భార్యకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. మోతె మండలం మేకలపాటి తండాకు చెందిన బానోతు క్రిష్ణకు అదే తండాకు చెందిన భారతితో 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పాపలు ఉన్నారు. 2023 జూన్ 23న క్రిష్ణ జేసీబీతో పొలం చదును చేసి మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి నిద్రించాడు. పొలంలో గుప్త నిధులు ఉన్నాయని, భర్తను చంపితే నిధులు వస్తాయని భారతికి తండ్రి భద్రు చెప్పడంతో రాయితో ఇంట్లో నిద్రిస్తున్న క్రిష్ణ తలపై కొట్టింది. దీంతో క్రిష్ణ తలకు గాయలయ్యాయి. పక్క ఇంట్లో ఉన్న క్రిష్ణ అన్న, వదిన వచ్చి భారతిని బయటకు పంపించారు. వెంటనే క్రిష్ణను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా అప్పటికే గుప్తనిధుల కోసం భారతి తన కుమార్తెను గొంతు కోసం చంపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అప్పటి సీఐ వీరరాఘవులు కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మణ్‌నాయక్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితురాలికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సహకరించారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్లు..

హుజూర్‌నగర్: కన్న కుమార్తెను, అత్తపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చింతలపాలెం మండలం తమ్మవరం గ్రామానికి చెందిన అమెర సైదులు, లక్ష్మి దంపతుల కుమార్తె లావణ్యను గరిడేపల్లి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన చిల్లా నరసింహారావుకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి కుమార్తె నవ్యశ్రీ ఉంది. లావణ్య తన కుమార్తెతో కలిసి తమ్మవరం గ్రామానికి వెళ్లగా.. వారిని తీసుకెళ్లడానికి 2018 జనవరి 2వ తేదీన చిల్లా నరసింహారావు తమ్మవరం గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో లావణ్య తన కుమార్తెకు పాలు తాగిస్తుండగా.. నరసింహారావు ఆమెను లోపలికి పంపించి తన వెంట తెచ్చుకున్న విష పదార్థాన్ని పాలలో కలిపి కుమార్తెకు తాగించాడు. ఇరుగు పొరుగు వారు గమనించి లావణ్యకు, ఆమె తల్లి లక్ష్మికి విషయం చెప్పారు. పాప అస్వస్థకు గురికాగా ఆమెను హాస్పిటల్‌కు తరలించారు. ఆ తర్వాత తన అత్త లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన నరసింహారావు బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. లక్ష్మి కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు వచ్చి ఆమెను కాపాడారు. నిందితుడి మామ అమెర సైదులు ఫిర్యాదు మేరకు అప్పటి చింతలపాలెం ఎస్ఐ పరమేష్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. దర్యాప్తు పూర్తిచేసి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. పలువురు సాక్షులను విచారించిన జడ్జి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిలువేరు వెంకటేశ్వర్లు వాదనతో ఏకీభవిస్తూ నిందితుడు చిల్లా నరసింహారావుకు మూడేళ్లు జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారు. జరిమానా నుంచి రూ.49 వేలు బాధితురాలైన అమెర లక్ష్మికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌కు కోర్టు కానిస్టేబుల్ గురువారెడ్డి సహకరించారు.

ఆడబిడ్డ పుడితే అదృష్టంగా భావించాలి


పోస్టాఫీస్‌లో జమచేసిన నగదుకు సంబంధించిన పాస్‌బుక్ అందజేస్తున్న తహసీల్దార్

అనంతగిరి: ఆడబిడ్డ పుట్టిన ప్రతి కుటుంబం అదృష్టంగా భావించాలని తహసీల్దార్ కె. హిమబిందు అన్నారు. అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామంలో ఆడబిడ్డ పుడితే గ్రామానికి చెందిన కొందరు యువకులు 'మన ఊరు మహాలక్ష్మి' పేరుతో ఆ ఆడబిడ్డ పేరుపై పోస్టాఫీస్‌లో కొంత నగదు జమ చేయడం అభినందనీయమని తహసీల్దార్ అన్నారు. బుధవారం గోండ్రియాల గ్రామానికి చెందిన గౌరారాపు సునీత, కోటేష్ దంపతుల కుమార్తె లోక్య పేరుతో పోస్టాఫీస్‌లో రూ.18,464 నగదు జమ చేసి దానికి సంబంధించిన పాస్‌బుక్‌ను తహసీల్దార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మన ఊరు మహాలక్ష్మి వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్య లక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ఘనంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను అర్చకులు, భక్తులు గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

తాటికల్ వాసికి డాక్టరేట్


రామకృష్ణ

నకిరేకల్: నకిరేకల్ మండలం తాటికల్‌కు చెందిన చనగాని భిక్షం-జయమ్మ దంపతుల కుమారుడు చనగాని రామకృష్ణ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. దివ్యాంగుడైన రామకృష్ణ ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అంజయ్య పర్యవేక్షణలో 'ఆన్ ఇన్విస్టిగేషన్ ఇన్ టూ ది లైఫ్ అండ్ స్ట్రగుల్స్ ఆఫ్ ధర్మభిక్షంగౌడ్ (1922-2011)'అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. దీంతో రామకృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

రామన్నపేట యువకుడికి..


నాగరాజు

రామన్నపేట: రామన్నపేట మండల కేంద్రానికి చెందిన నకిరేకంటి నాగరాజు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. హిందీ దళిత్ కహానియో మే చత్రిత్ దళిత్ జీవన్ కా యతార్థ్(1980-2010)కే సందర్భ్ మే అను అంశంపై ప్రొఫెసర్ మాయాదేవి వాగ్మరే పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసం సమర్పించారు.. పీహెచ్‌డీ పట్టాను సాధించిన నాగరాజును పలువురు అభినందించారు.

గాజులమల్కాపురం వాసికి..


డాక్టరేట్ అందుకుంటున్న సందీప్

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురం గ్రామానికి చెందిన వట్టికూటి సందీప్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో దళిత బహుజనుల పాత్ర అనే అంశంపై చరిత్ర విభాగం ఆచార్యుడు అడపా సత్యనారాయణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గానూ ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా సందీప్‌ను స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

వేములపల్లి ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

వేములపల్లి: పాత కక్షలు మనస్సులో పెట్టుకొని భీమనపల్లి గ్రామంలో తన 4గుంటల భూమిని కబ్జా చేయిస్తూ తనపై అక్రమ కేసులు బనాయిస్తున్న వేములపల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని బాధితుడు నామిరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. భీమనపల్లిలో సర్వే నం 29లో గల తనకు 16గుంటల భూమి ఉండగా బెదిరించి తన నాన్న సంతకాలను తీసుకొని కొంత భూమిని ఆక్రమించారని, ఇంకా 4గుంటల భూమి రెండు వైపులా రోడ్డు ఉండగా ఇటీవల ఎస్ఐ అండతో బొంత వెంకటయ్య, బొంత రాము, బొంత శ్రీకాంత్, కుంచం నాగయ్య, అభిమల్ల జానకిరాములు, అభిమల్ల అశోక్, గడ్డం మారయ్య, మర్రి సుదర్శన్, కొణతం కృష్ణయ్య, కొణతం రాంబాబు, కొండ్ర సాలయ్య తదితరులు తమ భూమిలో ఉన్న టేకు, సుబాబుల్ చెట్లను నరికించారని ఆరోపించారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ స్పందించకుండా ఆ భూమిలో రూమ్ ఏర్పాటు చేయండని సలహా ఇచ్చారని అన్నారు. తనను బెదిరించిన వారితో పాటు వారికి సహకరించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

హైవేపై ఆటో బోల్తా

చిట్యాల: హైదరాబాద్ నుంచి మంచినూనె డబ్బాల లోడుతో వెళ్తున్న ఆట్రోటైరు పేలడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో బుధవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఆటోలోంచి కింద పడిపోయిన మంచినూనె డబ్బాలను స్థానికులు ఎత్తుకెళ్లారు. అనంతరం ఆటోను హైవే పైనుంచి పక్కకు తొలగించారు. ఈ ప్రమాదంతో కాసేపు హైవేపై ట్రాఫిక్ జాం ఏర్పడింది.


బోల్తా పడిన ఆటో

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

భువనగిరిటౌన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో పలు చోట్ల విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, భువనగిరి, నల్లగొండ సూర్యాపేట జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, చెట్ల కింద ఉండకూదని తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓ వైపు అధిక ఉష్ణోగ్రతలు, అటు వెంటనే వర్షాలు కురుస్తుండడంతో అనారోగ్యాలు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు సైతం హెచ్చరిస్తున్నారు.